ఇళ్లు కాదు.. ఊళ్ల నిర్మాణం

- జగన్ పాలనలో సొంతింటి కల సాకారం
- 2025 డిసెంబర్‌కు అన్ని ఇళ్లూ పూర్తి చేస్తాం
- ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి
- లబ్ధిదారులతో గృహ నిర్మాణ బాట





స్లైడ్స్ ద్వారా ప్రగతిని వీక్షిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడా చైర్‌పర్సన్ చంద్రకళాదీప్తి, కమిషనర్ వెంకటరావు తదితరులు

కాకినాడ: పేదల సొంతింటికల సాకారం చేసేందుకు దేశంలో ఎక్కడా లేని విధంగా ఇళ్లను కాకుండా ఊళ్లనే నిర్మిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమైందని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. 2019 ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం ఇళ్ల స్థలాలు ఇచ్చి గృహనిర్మాణాలు శరవేగంగా చేపడుతున్న అంశంపై లబ్ధిదారుల్లో అవగాహన కల్పించేందుకు ఎమ్మెల్యే ద్వారంపూడి శనివారం కొమరగిరి లే అవుట్‌కు బస్సుల్లో తీసుకువెళ్లారు.

ఇక్కడ దాదాపు 350 ఎకరాల్లో సుమారు 17 వేల మందికి ఇళ్ల స్థలాలు ఇవ్వగా 10 వేల ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి. వీటిని కాకినాడ 15, 17, 18 డివిజన్లకు చెందిన సుమారు రెండు వేల మందికి చూపించి తమ నిబద్ధతను తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ నగర పరిధిలోనే ఇళ్లు నిర్మించాలని తలపెట్టి దాదాపు 116 ఎకరాల్లో ఇంటి నిర్మాణాలకు ప్రతిపాదించగా టీడీపీ మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు తప్పుడు సమాచారంతో న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో పనులు నిలిచిపోయాయన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో నగరానికి దూరంగా స్థలాన్ని సేకరించి సకల మౌలిక సదుపాయాలు కల్పించి ఆ లే అవుట్‌ను మరో టౌన్‌షిప్‌గా తీర్చిదిద్దుతున్నామని ద్వారంపూడి చెప్పారు. పైగా ఇళ్ల నిర్మాణంతో పాటు చరిత్రలో ఎప్పుడు లేని విధంగా రిజిస్ట్రేషన్లు కూడా చేసి సంపూర్ణ హక్కులు కూడా కల్పిస్తున్నట్టు ఎమ్మెల్యే పేర్కొన్నారు.

2014–19 మధ్య అధికారంలో ఉన్న టీడీపీ ఒక్క ఇల్లు కూడా నిర్మించలేకపోయిందని, తమ ప్రభుత్వం ఇళ్లను కాకుండా ఊళ్లనే నిర్మిస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. దాదాపు 650 ఎకరాలను సేకరించి మరీ పట్టాలు ఇచ్చామన్నారు. తాను మరోసారి విజయం సాధించి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 2025 డిసెంబర్ నాటికి మొత్తం 30 వేల మందికి ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసి అప్పగిస్తామని హామీ ఇచ్చారు. ప్రతి ఇక్కరి సొంతింటి కల సాకారం కావాలంటే జగన్ ప్రభుత్వం మరోసారి గెలుపొందాలన్నారు. ప్రజలను మభ్యపెట్టేందుకు రెండు సెంట్లు ఇస్తామని, ఏవేవో పథకాలు అమలు చేస్తామంటూ టీడీపీ–జనసేన చేస్తున్న తప్పుడు వాగ్దానాలను నమ్మొద్దని హితవు పలికారు. నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు, అర్హత ఉన్న ప్రతి ఒక్కరి సొంతింటి కల నెరవేర్చే లక్ష్యంతో కొమరగిరిని పైలెట్ ప్రాజెక్టుగా తీసుకున్నామన్నారు. భవిష్యత్‌లో ఈ ప్రాంతం మరో టౌన్‌షిప్‌గా అవతరించబోతుందని, ప్రజలు వేగంగా ఇళ్ల నిర్మాణం చేసుకోవాలన్నారు. గృహనిర్మాణ ప్రగతిపై ఎమ్మెల్యే ద్వారంపూడి స్లైడ్స్ ద్వారా ప్రజలకు వివరించారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, రాష్ట్ర ప్రచార కమిటీ ప్రధాన కార్యదర్శి రావూరి వెంకటేశ్వరరావు, మాజీ డిప్యూటీ మేయర్ మీసాల ఉదయ్‌కుమార్, నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు, హౌసింగ్ డీఈ సత్యనారాయణరెడ్డి, టీపీఆర్వో మానే కృష్ణమోహన్, జేసీఎస్ కన్వీనర్ సుంకర విద్యాసాగర్, సీఎంఎం డేగల వెంకటరాజు, పలువురు మాజీ కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు. అక్కడికి వచ్చిన లబ్ధిదారులందరికీ భోజన వసతి కల్పించారు.

సచివాలయాలతో మెరుగైన సేవలు



కొవ్వాడలో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: గ్రామ సచివాలయ వ్యవస్థతో ప్రజలకు సకాలంలో సేవలు అందుతున్నాయని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. మండలంలోని కొవ్వాడలో రూ.38.6 లక్షలతో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. పేదలకు మెరుగైన సేవలందించేందుకు గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను సీఎం జగన్ అందుబాటులోకి తీసుకువచ్చారు. వాటికి శాశ్వత నిర్మాణాలు చేపట్టడంతో చిరస్థాయిగా అవి నిలిచిపోతాయన్నారు. జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, సీనియర్ నాయకుడు గోపుశెట్టి బాబ్జీ తదితరులు పాల్గొన్నారు. అలాగే సూర్యారావుపేట క్రీస్తు సంఘం వార్షికోత్సవం ఉజ్జీవ మహాసభలో పాల్గొన్న ఎమ్మెల్యే కన్నబాబు పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలిపారు.

చురుగ్గా పైప్‌లైన్ మరమ్మతులు



మరమ్మతులను పరిశీలిస్తున్న కమిషనర్

కాకినాడ: కాకినాడ శారదాదేవి ఆలయ ప్రాంతంలో జరుగుతున్న పైప్‌లైన్ మరమ్మతులను నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు శనివారం పరిశీలించారు. విద్యుత్‌నగర్, ప్రతాప్‌నగర్ ట్యాంకుకు వెళ్లే పంపింగ్ లైన్ మరమ్మతులకు గురి కావడంతో వాటర్‌వర్క్స్, ఇంజినీరింగ్ విభాగానికి చెందిన అధికారులు మరమ్మతులు చేపట్టారు. ఆ పనులను కమిషనర్ జె.వెంకటరావు పర్యవేక్షించారు. పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు ఎటువంటి అవాంతరం లేకుండా నీరందించాలని సూచించారు. ఆదివారం ఉదయానికి పనులు పూర్తిచేసి ప్రజలకు నీరందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట డీఈ సుబ్బారావు, ఏఈ వై.నాగేశ్వరరావు, ట్యాప్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో వేంకటేశ్వరుని చక్రస్నానం



స్వామివారికి చక్రస్నానం చేయిస్తున్న అర్చకుడు సీతారామం

కరప: మండలం యండమూరులోని సామ్రాజ్యలక్ష్మి, గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి దివ్య కల్యాణ వేడుకల్లో భాగంగా శనివారం చక్రస్నానం నిర్వహించారు. ఆలయ వంశపారంపర్య అర్చకుడు పెద్దింటి సీతారామం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పల్లకిలో ఊరేగింపుగా తీసుకెళ్లి చక్రస్నానం చేయించి స్వామివార్ల ఉత్సవ విగ్రహాలను శేషవాహనంపై ఉంచి గ్రామోత్సవం జరిపారు. దేవదాయశాఖ ఈఓ పీవీఎస్ సూర్యనారాయణరాజు, కె.రఘు, గ్రామపెద్దలతో కలసి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

శ్రీయువసేనకు ఆర్థిక సాయం



సతీష్‌కు చెక్ అందజేస్తున్న ద్వారంపూడి వీరభద్రారెడ్డి దంపతులు

కాకినాడ క్రైం: శ్రీయువసేన స్వచ్ఛంద సంస్థకు రాష్ట్ర రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, శ్రీ వీరభద్ర ఎక్స్‌పోర్ట్స్ అధినేత ద్వారంపూడి వీరభద్రారెడ్డి రూ.3 లక్షల ఆర్థిక సాయం ప్రకటించారు. సతీమణి మాధురీలత చేతుల మీదుగా ఆ మొత్తాన్ని చెక్ రూపంలో సంస్థ వ్యవస్థాపకుడు బొల్లం సతీష్‌కు శనివారం ఆయన కార్యాలయంలో అందజేశారు. సతీష్ ఆధ్వర్యంలో ఎందరో అభాగ్యులకు సేవలందించి కాకినాడ నగరానికి కీర్తి తీసుకువచ్చారని కొనియాడారు. కోవిడ్ వేళ తండ్రులను కోల్పోయిన ఎందరో పిల్లల జీవితాలలో వెలుగులు నింపడంలో ద్వారంపూడి కీలక భూమిక పోషించారని అన్నారు.

వైద్య విద్యార్థికి రూ.50వేలు..



వైద్య విద్యార్థికి రూ.50 వేల చెక్కు అందజేస్తున్న దాతలు

బాలాజీచెరువు: పూర్వవిద్యార్థులందరూ కలసి ఏర్పాటుచేసుకున్న రెడ్ కాన్వెంట్ పూర్వ విద్యార్థుల చారిటబుల్ ట్రస్ట్ (1978) ద్వారా ఏడేళ్ల కాలంలో రూ.కోటికి పైగా సేవా కార్యక్రమాలు నిర్వహించామని ట్రస్ట్ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ బాదం బాలకృష్ణ పేర్కొన్నారు. బాదం బాలకృష్ణ క్లినికల్ ల్యాబ్‌లో శనివారం ట్రస్ట్ సభ్యుడు ఎన్ఆర్ఐ నగేష్ వైద్య విద్యార్థికి రూ.50 వేలు ఆర్థిక సహాయం చేశారు. ట్రస్ట్ ప్రెసిడెంట్ సీమకుర్తి పాపారావు, కార్యదర్శి జగదీష్, కోశాధికారి కళ్యాణి పాల్గొన్నారు.

డిజిటల్ బ్లాక్ బోర్డు వితరణ



డిజిటల్ బోర్డును ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్ విఠల్

కాకినాడ క్రైం: 2002 బ్యాచ్‌కు చెందిన రంగరాయ వైద్య కళాశాల పూర్వ విద్యార్థులు (మైటీ మాస్టోస్) జనరల్ మెడిసన్ విభాగానికి రూ.4 లక్షల విలువైన డిజిటల్ బ్లాక్ బోర్డు అందించారు. శనివారం జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎంపీఆర్ విఠల్, మెడిసిన్ హెచ్‌వోడీ, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ హరి విజయకుమార్‌లు సంయుక్తంగా ప్రారంభించారు.

దినసరి వేతనం పెంచాలి

కాకినాడ రూరల్: ఉపాధి కూలీలకు దినసరి వేతనం రూ.600కు పెంచి, 200 పనిదినాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాటిపాక మధు డిమాండ్ చేశారు. పండూరు, తమ్మవరం, పెనుమర్తి తదితర గ్రామాలలో శనివారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పర్యటించి కూలి దండు, మాసపత్రిక సభ్యత్వాలు సేకరించారు. ఆయన మాట్లాడుతూ పేదలకు భూములు పంపిణీ చేయాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కేశవరపు అప్పలరాజు పాల్గొన్నారు.

కారు ఢీకొని యువకుడి మృతి

కాకినాడ క్రైం: కాకినాడలో జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. నగరానికి చెందిన కాలాడి పవన్‌కుమార్ (27) ఓ ప్రైవేటు ఉద్యోగి. తన ఇంటి నుంచి జగన్నాథపురం మీదిగా తన ద్విచక్రవాహనంపై శనివారం సాయంత్రం పాత బస్టాండు ప్రాంతంలో ఉన్న అత్తగారింటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో అటుగా మితిమీరిన వేగంతో వచ్చిన ఓ కారు పవన్‌కుమార్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పవన్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్న వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

స్కేటింగ్‌కు ఉజ్వల భవిత



స్కేటింగ్ రింక్ ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ గీత



వివిధ జిల్లాలకు చెందిన స్కేటింగ్ క్రీడాకారులు

- ఎంపీ వంగా గీత
- రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీలు ప్రారంభం

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించిన తొలి ఇండోర్ స్కేటింగ్ రింక్ దేశంలోనే తొలిసారిగా కాకినాడలో ఏర్పాటైందని ఎంపీ వంగా గీత అన్నారు. శనివారం కాకినాడ రాజా ట్యాంక్ ఆవరణలోని వైఎస్సార్ ఇంటర్‌నేషనల్ ఇండోర్ స్కేటింగ్ రింక్‌లో ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి పోటీలను ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఎంపీ మాట్లాడుతూ ఈ రింక్‌ను క్రీడారంగంలో ఒక కలికితు రాయిగా అభివర్ణించారు. ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ క్రీడారంగంలో ఎన్నో విజయాలు సాధిస్తున్న కాకినాడలో ఏర్పాటైన ఈ రింక్ ఈ ప్రాంత స్కేటింగ్ క్రీడాకారులకు ఎంతో ప్రయోజనకరం అన్నారు. 200 మీటర్ల ట్రాక్‌తో పాటు వీక్షకుల కోసం గ్యాలరీ, టాయిలెట్స్, కార్యాలయం సహా అన్ని సదుపాయాలు కల్పించామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ క్రీడారంగానికి ఎంతో ప్రాధాన్యమిస్తున్నారని, ఇటీవల నిర్వహించిన ఆడుదాం–ఆంధ్రా కార్యక్రమమే ఇందుకు నిదర్శనం అన్నారు. అనంతరం రాష్ట్రస్థాయి పోటీలను అతిథులు ప్రారంభించారు. రింక్ నిర్మాణానికి కృషిచేసిన స్మార్ట్ సిటీ ఎస్ఈ పి.వెంకట్రావు, కాంట్రాక్టర్లు ఆదిత్య, ధర్మతేజ్‌లను ఎంపీ, ఎమ్మెల్యేలు సత్కరించారు. ఎమ్మెల్సీ కర్రిపద్మశ్రీ, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, కమిషనర్ జె.వెంకటరావు, ఏడీసీ నాగనరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఓటింగ్ శాతం పెరిగేలా కృషి చేయండి

- డీఆర్వో తిప్పే నాయక్
- వివిధ శాఖల అధికారులతో సమీక్ష



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఆర్వో తిప్పే నాయక్

కాకినాడ సిటీ: ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెరిగేందుకు వివిధ శాఖల వారీగా నిర్ణయించిన అవగాహ కార్యక్రమాలు సక్రమంగా అమలు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి తిప్పే నాయక్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో సాధారణ ఎన్నికలకు సంబంధించి స్వీప్ కార్యక్రమాల నిర్వహణపై డీఈవో పి.రమేష్‌తో కలిసి ఆయన వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. అందరూ భాగస్వాములైనపుడే ఎన్నికలు సక్రమంగా జరుగుతాయన్నారు. పట్టణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతం పెరిగేలా ఇంజినీరింగ్, డిగ్రీ కళాశాలలతో పాటు నర్సింగ్ కళాశాలలపై ప్రత్యేక దృష్టి పెట్టి యువ ఓటర్లను ఓటు హక్కు ప్రాధాన్యంపై అవగాహన సదస్సులు, వివిధ పోటీలను నిర్వహించాలన్నారు. డీపీవో కె.భారతీ సౌజన్య, ఐసీడీఎస్ పీడీ కె.ప్రవీణ, డ్వామా పీడీ ఎ.వెంకటలక్ష్మి, ఆర్డీవో పీవీ సాయిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పల్స్‌పోలియోను విజయవంతం చేయండి

జిల్లాలో మార్చి 3వ తేదీన జరిగే పల్స్ పోలియోను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి డి.తిప్పే నాయక్ అన్నారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్‌లోని వివేకానంద మీటింగ్ హాలులో సమీక్షించారు. ఐదేళ్ల లోపు పిల్లలందరికీ రెండు పోలియో చుక్కలు వేయించాలన్నారు. డీఎంహెచ్ఓ డాక్టర్ జె.నరసింహనాయక్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 1,94,332 మంది 5 ఏళ్లలోపు చిన్నారులు ఉన్నారని వారి కోసం మొత్తం 1374 పోలియో చుక్కల కేంద్రాలు ఏర్పాటు చేశామని అన్నారు. అలాగే 125 మంది సూపర్‌వైజర్లు, 48 మంది మొబైల్ టీములు ఈ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ కె.రత్నకుమార్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఈవెనింగ్ క్లినిక్‌ల పరిశీలన



జీజీహెచ్‌లో పర్యటిస్తున్న డీఎంఈ డాక్టర్ నరసింహం

కాకినాడ క్రైం: రాష్ట్ర వైద్య విద్యా సంచాలకుడు (డీఎంఈ) డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం శనివారం జీజీహెచ్‌ను సందర్శించి ఈవెనింగ్ క్లినిక్‌లను పరిశీలించారు. వాటి వల్ల రోగులకు అందుతున్న ప్రయోజనాలను నేరుగా రోగులతో మాట్లాడుతూ అడిగి తెలుసుకున్నారు. అత్యవసర విభాగాన్ని, మెడిసిన్, సర్జరీ, సీటీ స్కాన్, స్కిల్ ల్యాబ్‌లను, ఓపీల తీరు తెన్నులను పరిశీలించారు. రోగులకు అత్యుత్తమ వైద్య సేవలు అందేలా అన్ని చర్యలు తీసుకోవాలని సూపరింటెండెంట్ డాక్టర్ ఎంపీఆర్ విఠల్‌కు సూచించారు. ఆయన వెంట ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణువర్ధన్, డీసీఎస్ ఆర్ఎంవో డాక్టర్ అనిత, ఆర్ఎంవో డాక్టర్ రాహుల్, ఫోరెన్సిక్ హెచ్‌వోడీ డాక్టర్ ఉమామహేశ్వరరావు తదితరులు ఉన్నారు.

దీక్షితాత్మభాస తిరుమలేశ శతకం ఆవిష్కరణ



శతకాన్ని ఆవిష్కరిస్తున్న రిజిస్ట్రార్ సుమలత, ప్రొఫెసర్ దీక్షితులు, ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్

బాలాజీచెరువు: జేఎన్‌టీయూకే ఫార్మాస్యూటికల్ సైన్స్ ప్రత్యేక అధికారి ప్రొఫెసర్ ఆర్.దీక్షితులు రచించిన దీక్షితాత్మభాస తిరుమలేశ శతకం ఆవిష్కరణ శనివారం వర్సిటీ సెనేట్ హాల్లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా రిజిస్ట్రార్ సుమలత హాజరై మాట్లాడుతూ తెలుగు పలు విధాలుగా మారుతున్న నేటి తరుణంలో దీక్షితులు గణిత శాస్త్ర అధ్యాపకులై కూడా సాహిత్య సృజన ప్రవృత్తి కలిగి ఉండటం సంతోషమన్నారు. తటవర్తి గురుకులం తెలుగు భాష వ్యాప్తికై కృషి చేయడం అభినందనీయమన్నారు. తటవర్తి గురుకులాధిపతి తటవర్తి కళ్యాణ చక్రవర్తి మాట్లాడుతూ గురుకుల విద్యార్థులు వంద శతకాలు రచించాలని నిర్ణయించగా 12వ శతకాన్ని దీక్షితులు రచించారన్నారు. సాహిత్య రసజ్ఞుల హృదయాలను స్పందింపజేసినప్పుడే దానికి సార్థకత ఏర్పడుతుందన్నారు. ప్రొఫెసర్ దీక్షితులు మాట్లాడుతూ తెలుగులో ఎన్నో శతకాలు ఉన్నప్పటికీ మనకి మొట్టమొదటిగా గుర్తొచ్చేది వేమన శతకమని, ఈ శతకాన్ని సరళంగా రూపొందించేందుకు ప్రయత్నించానన్నారు. దీంతో పాటు ఆటవెలది, తేటగీతి రీతుల్లో పద్యాలు రచించానన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

వర్క్‌షాప్‌కు వెళితే వేధిస్తున్నాడు


- మెకానిక్‌పై నర్సుల ఫిర్యాదు



సురేంద్రపై లిఖితపూర్వక ఫిర్యాదును సూపరింటెండెంట్‌కు అందజేస్తున్న నర్సులు

కాకినాడ క్రైం: విధి నిర్వహణలో భాగంగా తమ వార్డులో ఉన్న పరికరాల మరమ్మతు కోసం వర్క్‌షాప్‌కి వెళితే అక్కడ గ్రేడ్–2 మెకానిక్ సురేంద్రరాజు తమని వేధిస్తున్నాడని సూపరింటెండెంట్ డాక్టర్ ఎంపీఆర్ విఠల్‌కు జీజీహెచ్ నర్సులు మొరపెట్టుకున్నారు. ఈ మేరకు 50 మంది నర్సులు తమ సంతకాలతో శనివారం లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. నర్సులను ఏకవచనంతో సంబోధించడం, చులకన భావంతో చూడటం, కేకలు వేయడం సురేంద్రకు పరిపాటిగా మారిందని ఆరోపించారు. పెద్దగా అరుస్తూ దురుసుగా ప్రవర్తిస్తున్నాడనీ, నర్సులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాడని విన్నవించారు. ఈ పరిస్థితిపై నర్సులు తమ అధికారులకు ఫిర్యాదు చేస్తే ఎవరిని ఎక్కడ నొక్కాలో తనకు తెలుసు అంటూ అసభ్య పదజాలంతో అవమానించాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. వార్డులో పని అవ్వాలంటే తన రాక కోసం వర్క్‌షాప్ బయట డోర్ వద్ద నిలబడి ఎదురు చూడాలంటూ అవమానంగా మాట్లాడుతున్నాడని పేర్కొన్నారు. అతడిపై విచారణ జరుగుతున్న నేపథ్యంలో విచారణ బృందం తమ ఆవేదనను పరిగణలోకి తీసుకొని సంబంధిత అంశాల స్పష్టత, వాస్తవికత నిర్ధారణల కోసం తమకూ అవకాశం కల్పించాలని కోరారు. సురేంద్రపై తక్షణ చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా వారు లిఖితపూర్వకంగా కోరారు.

సమాజ అవసరాల మేరకు రోటరీ సేవలు



ద్వారంపూడి వీరభద్రారెడ్డిని సత్కరిస్తున్న రోటరీ గోల్డెన్ జూబ్లీక్లబ్ సభ్యులు

బోట్‌క్లబ్: సమాజ అవసరాల మేరకు సేవా కార్యక్రమాలు చేయడంలో రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ ముందుంటుందని రాష్ట్ర రైస్‌మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి అన్నారు. రోటరీ క్లబ్ 119వ వ్యవస్థాపక దినోత్సవాన్ని స్థానిక రోటరీ హాల్‌లో శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వీరభద్రారెడ్డి క్లబ్ చేస్తున్న సేవలకు తన వంతు సాయంగా రూ.3 లక్షలు విరాళం ప్రకటించారు. అనంతరం రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ అధ్యక్షుడు నరహరిశెట్టి రవికృష్ణ ఆధ్వర్యంలో రోటరీ మాజీ గవర్నర్లు, అసిస్టెంట్ గవర్నర్లను, క్లబ్ మాజీ అధ్యక్షులను సత్కరించారు. డాక్టర్ ఎస్‌వీఎస్‌రావు, బాలకృష్ణ, రామకృష్ణ, మాచారెడ్డి, జీకె శ్రీనివాస్‌తోపాటు పలువురిని సత్కరించారు. అనంతరం క్లబ్ ఆధ్వర్యంలో ద్వారంపూడిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ జోగా చంద్రరావు, ట్రెజరర్ మాజేటి పవన్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా పార్వతీ, పరమేశ్వరుల సంబరం



ఆలయం వద్ద అగ్నిగుండం తొక్కుతున్న భక్తులు

కరప: మండలం గొర్రిపూడిలోని బసవేశ్వరస్వామి ఆలయంలో శనివారం రాత్రి పార్వతీ, పరమేశ్వరుల సంబరాన్ని కరికాల భక్తులు ఘనంగా నిర్వహించారు. గొర్రిపూడి పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి, స్వామివారిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. మాఘపౌర్ణమి సందర్భంగా బసవేశ్వరస్వామిని ప్రత్యేకంగా అలంకరించి అర్చకులు బాదంపూడి వీరవెంకట సత్యనారాయణశర్మ, శివకుమార్‌శర్మ పూజలు నిర్వహించారు. యేటా భీష్మ ఏకాదశి రోజున బసవేశ్వరస్వామి ఆలయంలో కళ్యాణ వేడుకలు నిర్వహించి, 5 రోజులపాటు వివిధ రీతులలో నిర్వహించే ఉత్సవాల్లో భక్తులు మొక్కులు తీర్చుకుంటారు. శనివారం రాత్రి భక్తులు స్వామివారిని దర్శించుకున్న తర్వాత ఆలయం వద్ద ఏర్పాటు చేసిన అగ్ని (నిప్పుల) గుండాన్ని తొక్కారు. ఆలయధర్మకర్త చప్పిడి నవీన్, నాగేశ్వరరావు తదితర కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించి, భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

పంచాయతీ ప్రణాళిక రూపొందించాలి



డీపీఓ భారతీసౌజన్యకు పూలమొక్కను అందజేస్తున్న సిబ్బంది

కరప: ప్రజల అవసరాలను గుర్తించి, వాటికి అనుగుణంగా ప్రభుత్వం నిర్దేశించి అంశాల మేరకు గ్రామ ప్రణాళిక రూపొందించాలని డీపీఓ కె.భారతిసౌజన్య అన్నారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని శనివారం ఆమె సందర్శించి, కార్యదర్శి ఎస్కే నాగేంద్రకుమార్, కేశవరావు, త్రిమూర్తులు తదితర పంచాయతీ, సచివాలయం సిబ్బందితో సమావేశమై పంచాయతీ కార్యకలాపాలపై సమీక్షించారు. గ్రామకంఠంలో ఉండే ప్రభుత్వ ఆస్తులు, వ్యక్తిగత గృహాలు, ఖాళీస్థలాలను గుర్తించేందుకు చేపట్టిన స్వామిత్వ సర్వే పకడ్బందీగా చేయాలన్నారు. ఇంటి పన్నులు నూరుశాతం వసూళ్లకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పీఎం విశ్వకర్మ పథకంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకంలో ఇచ్చిన ఇంటిస్థలం పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు. ముందుగా సిబ్బందితో కలసి కార్యదర్శి నాగేంద్రకుమార్ గ్రామ పంచాయతీకి మొదటిసారిగా వచ్చిన డీపీఓ భారతీ సౌజన్యకు పూలమొక్కను అందజేసి స్వాగతం పలికారు.

ఖేలో ఇండియాకు క్రీడాకారుల ఎంపిక



ఖేలో ఇండియా పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో డీఎస్‌డీఓ శ్రీనివాస్

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): పాండుచ్చేరిలో ఈనెల 27 నుంచి మార్చి1 వరకు జరిగే ఖేలో ఇండియా తైక్వాండో పోటీలకు ఉమ్మడి తూర్పుగోదావరి క్రీడాకారులు ఎంపికయ్యారని డిఎస్‌డీఓ బి.శ్రీనివాస్ కుమార్ శనివారం తెలిపారు. విమెన్ విభాగంలో డీఈ గ్రేస్ ప్రమీల, కె.హరిణి, వై.విజయ, బాలికల విభాగంలో పీఎస్ఎస్ నిహారిక ఎంపికయ్యారని ఆయన తెలిపారు.

భోగిగణపతి పీఠంలో సంకష్ట చతుర్థి మాసోత్సవాలు

బోట్‌క్లబ్: స్థానిక సూర్యారావుపేటలో ఉన్న భోగిగణపతి పీఠంలో ఈ మాఘమాసం నుంచి 24 నెలలు సంకష్టహర చతుర్థి మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు పీఠం వ్యవస్థాపకుడు దూసర్లపూడి రమణరాజు తెలిపారు. ఈ మేరకు శనివారం పీఠంలో మాసోత్సవాల ఆహ్వాన పత్రికలను ఆయన ఆవిష్కరించారు. ప్రతి సంకష్టహర చతుర్థి రోజున ఉదయం సన్నాయి మంగళ వాయిద్యాలతో పల్లకీసేవ పాలవెల్లి పత్రితో పూజ, పంచామృతాభిషేకాలు, సాయంత్రం సహస్ర నామపారాయణ, లక్షవత్తుల అఖండ హారతి జరుగుతాయన్నారు. భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలన్నారు.